నమస్తే తెలంగాణ

సంగారెడ్డి

I | హైదరాబాద్, ఆదివారం 25 ఆగస్టు 2024 | SANGAREDDY




దుబ్బాకలో అసంపూర్తిగా ఐటీఐ కళాశాల భవనం



దుబ్బాక ఐకేపీ భవనంలో కింద బైక్ షోరూం, పైన ప్రభుత్వ ఐటీఐ కళాశాల



ఫిట్టర్ విద్యార్థులు ప్రాక్టికల్స్ చేసేందుకు అద్దె భవనం బయట ఏర్పాటు చేసిన పరికరాలు

# సమస్యల మధ్య సాంకేతిక విద్య

## రెండు దశాబ్దాలుగా అద్దె భవనంలో కొనసాగుతున్న దుబ్బాక ఐటీఐ కళాశాల

- అసంపూర్తిగా నిలిచిన కళాశాల భవన నిర్మాణం
- అసౌకర్యాలతో చదువుకు అనాసక్తి చూపుతున్న విద్యార్థులు
- నాలుగు ట్రేడ్లతో కళాశాల ప్రారంభం
- ప్రస్తుతం రెండు ట్రేడ్లు కొనసాగింపు
- 50కి మించని విద్యార్థులు
- బిల్లులు రాక ఆగిన పనులు

పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు పారిశ్రామిక వృత్తి విద్యా(ఉపాధి) కోర్సును అందించేందుకు దుబ్బాకలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు సొంత భవనం లేక అద్దె భవనంలో సమస్యల మధ్య కొనసాగుతున్నది. ఐటీఐ కళాశాలలో సుమారు 20 ట్రేడ్‌లు (కోర్సులు) వరకు ఉంటాయి. ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు ఆయా వృత్తివిద్యా కోర్సుల్లో నైపుణ్య శిక్షణ అందిస్తారు. రెండేండ్ల పాటు ప్రాక్టికల్స్, థియరీ, తదితర సబ్జెక్టుల శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే ఐటీఐ కళాశాల ముఖ్యఉద్దేశం. అధికారుల నిర్లక్ష్యం మూలంగా దుబ్బాకలోని ఐటీఐ కళాశాల నామమాత్రంగా మారింది. సిద్దిపేట జిల్లాలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలలు మూడు ఉన్నాయి. సిద్దిపేట, కుకునూరుపల్లి, దుబ్బాకలో ఐటీఐ కళాశాలలు కొనసాగుతున్నాయి. ఐటీఐ కళాశాలలపై పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులకు శాపంగా మారింది.



ఐటీఐ కళాశాలలో ఒకే గదిలో రెండు ట్రేడ్‌లకు సంబంధించిన పదిమంది విద్యార్థులు

దుబ్బాక, ఆగస్టు 24: దుబ్బాకలో ఐటీఐ కళాశాల ఉన్నట్లు దుబ్బాక ప్రజలకే తెలియదు. అధికారుల నిర్లక్ష్యం మూలంగా దుబ్బాక ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(ఐటీఐ) కళాశాల నామమాత్రంగా కొనసాగుతున్నది. 2014లో దుబ్బాకకు ఐటీఐ కళాశాల మంజూరైంది. ఈ కళాశాలలో మొదట నాలుగు ట్రేడ్‌లు (కోర్సులు) ఉండేవి. విద్యార్థులు రాకపోవడంతో మూడు ట్రేడ్‌లు కొనసాగించారు. ప్రస్తుతం ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, వెల్డర్ కోర్సులు(ట్రేడ్‌లు) ఉండగా,కేవలం ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లు మాత్రమే కొనసాగిస్తున్నారు. వెల్డర్ ట్రేడ్‌లో విద్యార్థులు రాకపోవడంతో ఆ ట్రేడ్‌ను కొనసాగించడం లేదు. దుబ్బాకలో ఐటీఐ కళాశాలపై సరైన ప్రచారం లేకపోవడంతో చాలామంది ఉపాధి శిక్షణకు నోచుకోలేకపోతున్నారు. ఈ కళాశాలను చాలా రోజులు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌తో కొనసాగించారు. ఇటీవల ప్రిన్సిపాల్ పోస్టు భర్తీ అయ్యింది. ఐదుగురు ఇన్‌స్ట్రక్టర్‌లకు ఇద్దరు డిప్యుటేషన్‌పై వెళ్లారు. ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఇద్దరు వాచ్‌మెన్‌లు, ఇద్దరు అటెండర్‌లు ఉన్నారు. సొంతం భవనం లేకపోవడంతో దుబ్బాక ఐటీఐ కళాశాలకు ఆదరణ లేకుండా పోయింది. ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ రెండు ట్రేడ్‌ల్లో మొత్తం 60 మంది విద్యార్థులు ఉండాలి. ఫస్టియర్‌లో 30 మంది, సెకండియర్‌లో 30 మంది మొత్తం 60 సీట్లు ఉన్నాయి. ఫస్టియర్ అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం రెండు ట్రేడ్‌ల్లో కలిపి ఫస్ట్ ఇయర్‌లో 15 మంది , సెకండియర్‌లో 22 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఇందులో కళాశాలకు పది మంది కూడా రావడం లేదు. విద్యార్థులతో సమానంగా ఇందులో పనిచేస్తున్న సిబ్బంది ఉండడం గమనార్హం.

### ఏండ్ల తరబడి ఆగిన పనులు...

దుబ్బాకలో 2014లో ఐటీఐ కళాశాల మంజూరు కాగా, మొదట పాత ఎంపీడీవో కార్యాలయంలో, ప్రస్తుతం ఐకేపీ భవనంలో కళాశాల కొనసాగుతున్నది. ఐకేపీ భవనంలో కింద ఓ మోటర్ బైక్ షోరూం కొనసాగుతున్నది. పైన రెండు గదుల్లో ఐటీఐ కళాశాల కొనసాగుతోంది. ఇక్కడ ఐటీఐ కళాశాల ఉన్నట్లు చాలామందికి తెలియదు. కింద ప్రైవేటు బైక్ షోరూం ఉండడంతో ఐటీఐ కళాశాల కనబడకుండా పోయింది. దుబ్బాక – హబ్షీపూర్ రోడ్డు పక్కన ఐటీఐ కళాశాలకు 5 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 5 కోట్లు నిధులు మంజూరు చేసింది. జీ ప్లస్ వన్‌లో ఐటీఐ కళాశాల భవనం నిర్మాణం చేపట్టారు. బిల్లులు రాక రూ.3.50 కోట్లతో భవనం అసంపూర్తిగా ఆగిపోయింది. విద్యార్థులకు పక్కా భవనం అందని ద్రాక్షగా మారింది. అసంపూర్తి భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

### ఇరుకైన గదిలోనే ప్రాక్టికల్స్, బోధన



దుబ్బాకలో ఐటీఐ కళాశాలకు పక్కా భవనం లేకపోవడంతో ప్రస్తుతం అద్దె భవనంలో ఇరుకైన గదుల్లో ప్రాక్టికల్స్, థియరీ చెబుతున్నారు. ఒక గదిలో ప్రిన్సిపాల్, స్టాఫ్ ఉంటున్నారు. మరొక గదిలోనే రెండు ట్రేడ్‌లకు సంబంధించిన విద్యార్థులం ఉంటున్నాం. ఇరుకైన గదిలో ప్రాక్టికల్స్ నేర్పించలేకపోతున్నారు.

– శ్రీకాంత్, ఫిట్టర్ విద్యార్థి

### చాలా ఇబ్బందిగా ఉంది..



చిన్నపాటి గదిలో అందరికీ బోధించడంతో ఇబ్బందిగా మారింది. ఐటీఐ కళాశాలల రెండు ట్రేడ్‌లు ఉండగా...ఎలక్ట్రీషియన్, ఫిట్టర్‌లకు వేర్వేరుగా థియరీ బోధించాల్సి ఉంటుంది. అలా కాకుండా అందరికి ఒకేచోటనే ప్రాక్టికల్స్, థియరీ, ఇతర సబ్జెక్టులను బోధిస్తున్నారు. ఇన్‌స్ట్రక్టర్‌లకు, నేర్చుకునేందుకు మాకు ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి పక్కా భవనం పూర్తిచేసి ఐటీఐ కళాశాలను కొనసాగించాలి. ఐటీఐని బలోపేతం చేసి మాకు సౌకర్యాలు కల్పించాలి.

– దేవానంద్, ఎలక్ట్రీషియన్ విద్యార్థి



సిద్దిపేట జిల్లా తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి పంపింగ్ అవుతున్న గోదావరి జలాలు

# తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు

కొమురవెల్లి, ఆగస్టు 24:సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి శనివారం గోదావరి జలాలను విడుదల చేశారు. ఈనెల 22న చేర్యాల పట్టణంలో రైతులందరికీ పంట రుణ మాఫీ చేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి రెండు రోజుల్లో నీళ్లు విడుదల చేయకుంటే పెద్దఎత్తున రైతులతో వచ్చి ఉద్యమిస్తామని హెచ్చరించారు. దీంతో అధికారులు తలొగ్గి నీటిని విడుదల చేశారు. పదేండ్లలో ఎప్పుడూ లేని విధంగా తపాస్‌పల్లి రిజర్వాయర్‌లో నీరు అడుగంటి పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సుమారు ఎనిమిది నెలల తర్వాత మొట్టమొదటిసారి తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు విడుదల చేయడం విశేషం.

# బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

## హుస్నాబాద్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్




అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్

అక్కన్నపేట, ఆగస్టు 24: బాలికలు ఆత్మస్థైర్యంతో ధైర్యంగా ముందుకెళ్లాలని హుస్నాబాద్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్ అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు ఉన్నతమైన లక్ష్యంతో చదువుకోవాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, చిన్నప్పటి నుంచే పిల్లలు క్రమశిక్షణతో పెరిగితే సమాజంలో నేరాలను అరికట్టవచ్చన్నారు. సంవత్సరానికి నాలుగున్నర లక్షల లోపు ఆదాయం కలిగిన వారికి కోర్టు కేసుల పరిష్కారం విషయంలో న్యాయ సహాయాన్ని అందించేందుకు ప్రతి మండలంలో న్యాయసేవాధికార సంస్థ కృషిచేస్తున్నదన్నారు. లోక్ అదాలత్ ద్వారా సివిల్ కేసులను కక్షిదారులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. రాజీమార్గమే రాజమార్గమని, లోక్‌అదాలత్‌లో సివిల్ కేసులు పరిష్కరించడం గొప్ప విషయమన్నారు. నేటి యువత సన్మార్గంలో నడుచుకోవాలని, లక్ష్యంతో చదువుకొని ఉద్యోగ, ఉపాధి రంగాల్లో స్థిరపడాలన్నారు. గొడవలకు దూరంగా ఉండాలని, క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు జీవితాలను నాశనం చేస్తాయన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై విజయభాస్కర్, ఏజీపీ ఒగ్గోజు సదానందం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, న్యాయవాదులు దికొండ ప్రవీణ్, ఉప్పరపల్లి సంపత్, జెరిపోతుల కిరణ్, కేజీబీవీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ధనలక్ష్మి పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు నిర్వహించిన ఫ్రీడం వాక్‌లో ఎస్పీ రూపేశ్, వాకర్స్

# డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

- యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- ఎస్పీ చెన్నూరి రూపేశ్
- సంగారెడ్డిలో సందడిగా ఫ్రీడం వాక్

సంగారెడ్డి, ఆగస్టు 24: సమాజ నిర్మాణానికి యువతే కీలకమని, యువత లక్ష్య సాధనకు పట్టుబిగిస్తే డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టవచ్చని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్ అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి జిల్లా కోర్టు వరకు మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ఫ్రీడం వాక్‌ను ఆయన ప్రారంభించారు. ఫ్రీడం వాక్‌ను పోలీసు యంత్రాంగం, సహారా దవాఖాన సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించగా పట్టణ ప్రజలు, ఔత్సాహికులు, యువత అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినందుకు ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు యువత ముందుకు రావాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. యువత ఒక లక్ష్యాన్ని పెట్టుకుంటే అమలయ్యే వరకు నిద్రపోరని గుర్తుచేశారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదక ద్రవ్యాల నిర్మూలనకు యువత కీలకం కావాలని కోరారు.

### డీ-అడిక్షన్‌తో యువతలో చైతన్యం

డి-అడిక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించి యువతలో చైతన్యం తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. వీలైతే దేశానికి భారం కాకూడదని, చెడు మార్గంలో నడవడానికి ప్రధాన కారణం సినిమా లేనని, సినిమాలో చూపించే చెడుకు ప్రభావితం కాకుండా దానిలోని నీతిని గుర్తించాలన్నారు. ఒక వ్యక్తి జీవితంలో తొలి 25ఏండ్లు చాలా కీలకమని, కష్టపడి చదివి లక్ష్యాన్ని నెరవేర్చుకున్నట్లైతే జీవితం అందంగా ఉంటుందన్నారు. గుట్కా, సిగరెట్ వంటి వాటికి బానిసలైతే సర్వస్వం కోల్పోవాల్సి వస్తున్నదన్నారు. యువతపై తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. భారతదేశ పౌరులుగా పుట్టడం అదృష్టమని, భారత పౌరులుగా దేశానికి ఏదోరకంగా ఉపయోగపడాలన్నారు. నూతన చట్టాలపై అవగాహన కలిగి మంచి మార్గంలో నడవాలని యువతకు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో సహారా దవాఖాన డైరెక్టర్ శంకర్, డీఎస్పీ సత్తయ్యగౌడ్, నార్కోటిక్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ విజయ్ కృష్ణ, ఇంటలిజెన్స్ డీఎస్పీ మురళి, సంగారెడ్డి పట్టణ, రూరల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది, సహారా దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

# ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

- తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులు
- మెదక్ జిల్లా రామాయంపేట మండలం జేమ్లా తండాలో ఘటన

రామాయంపేట, ఆగస్టు 24: తల్లిదండ్రులను కోల్పోయి చిన్నారులు అనాథలయ్యారు. ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. నా అనే వారు లేక ఇద్దరు చిన్నారులు బిక్కుబిక్కుమంటూ పూరి గుడిసెలోనే నివసిస్తున్నారు. ఉన్ననాడు తింటున్నారు.. లేనినాడు పస్తులుంటున్నారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం దంతెపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న జేమ్లా తండాకు చెందిన సభావత్ ఫకీరా రెండేండ్ల క్రితం కరోనా సమయంలో మృతి చెందాడు. ఈనెల 16న తల్లి సభావత్ అంజి అనారోగ్యంతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. వీరికి ఇద్దరు చిన్నారులు కార్తిక్, నిర్మల ఉన్నారు. తల్లిదండ్రులు మృతి చెందడంతో చిన్నారులు అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. దాతలు ఆసరా కల్పించి, వారి చదువులకు సాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఎవరైనా దాతలు చిన్నారులకు ఆర్థికంగా సాయం అందించి ఆదుకోవాలనుకుంటే 9346175796 నంబర్‌లో సంప్రదించి, చిన్నారులకు సాయం అందించాలని తండావాసులు కోరారు.



మెదక్ జిల్లా రామాయంపేట మండలం దంతెపల్లి పంచాయతీ పరిధిలోని జేమ్లాతండాలో గుడిసెలో ఉంటున్న చిన్నారులు

# కొత్త జీపీగా తాట్‌పల్లి

- గెజిట్ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- సంబురాల్లో మునిగిన గ్రామస్తులు
- సంగారెడ్డి జిల్లాలోనే అతిపెద్ద మండలంగా అవతరించిన న్యాల్‌కల్





కొత్త పంచాయతీగా ఏర్పడిన తాట్‌పల్లి గ్రామం, సంబురాలు చేసుకుంటున్న గ్రామస్తులు

న్యాల్‌కల్, ఆగస్టు 24: గ్రామ పంచాయతీ ఎన్నికలకు కసరత్తు జరుగుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పంచాయతీల ఏర్పాటుకు ఆమోద ముద్ర వేసింది. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో నూతనంగా తాట్‌పల్లి గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేస్తూ శనివారం గెజిట్ ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలో ఇప్పటి వరకు 37 గ్రామ పంచాయతీలు ఉండగా తాజాగా వాటి సంఖ్య 38కి చేరి జిల్లాలోనే న్యాల్‌కల్ అతిపెద్ద మండలంగా అవతరించింది. 2018లో ప్రభుత్వం అనుబంధ గ్రామాలు, తండాలు, గూడాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయినా కొన్ని అనుబంధ గ్రామాల్లో కొత్త పంచాయతీల ఏర్పాటుకు డిమాండ్లు తెరపైకి వచ్చాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనుబంధ గ్రామాల ప్రజల విజ్ఞప్తి మేరకు కొత్త పంచాయతీలు ఏర్పాటు చేయాలని అప్పటి ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి విన్నవించారు. నాటి ప్రతిపాదనల మేరకు మండలంలోని టేకూర్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన తాట్‌పల్లిని కొత్త పంచాయతీగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం తాజాగా ఆమోదం తెలిపింది.

### ఎన్నికల నిర్వహణకు కసరత్తు

గ్రామ పంచాయతీల పాలక వర్గాల గడువు ఈ సంవత్సరం ఫిబ్రవరి 1వ తేదీతో ముగిసింది. దీంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్న పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఇప్పటికే ఓటర్ల జాబితా తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలోని గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలకు ఓటరు జాబితా రూపకల్పన, వార్డుల విభజన తదితర అంశాలపై సంబంధిత మండల ఎన్నికల అధికారులు శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన కల్పించారు. కొత్తగా ఏర్పడిన తాట్‌పల్లి గ్రామ పంచాయతీలో కూడా ఎన్నికలు జరుగనున్నాయి. పాత పంచాయతీ టేకూర్ పంచాయతీ పరిధిలోని అనుబంధ గ్రామమైన తాట్‌పల్లి వేరుపడి పంచాయతీగా మారడంతో అక్కడి వార్డుల పునర్విభజన చేయనున్నారు. పంచాయతీలోని మొత్తం ఓటర్లను ఇంటి నంబర్లతోసహ భౌగోళికంగా వార్డుల విభజన చేయనున్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు మార్చుతారా లేక రిజర్వేషన్లను అనుసరించే ఎన్నికలు నిర్వహిస్తారా అనే విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఒకరినొకరు స్వీట్లు పంచుకుంటూ గ్రామంలో సంబురాలు చేసుకున్నారు. కొత్తగా గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసినందుకు గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రభుత్వానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

### ప్రతిఒక్కరికీ రుణపడి ఉంటాం



గతంలో ప్రతిపనికి పక్కనే ఉన్న ముంగికి వెళ్లాల్సి వచ్చేది. ఎన్నో ఏండ్ల నుంచి చాలా బాధలు అనుభవించాం. మా ఊరు గ్రామ పంచాయతీగా ఏర్పడడంతో ఇబ్బందులు తప్పినాయి. గ్రామాన్ని నూతన పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు సహకరించిన ప్రతిఒక్కరికీ రుణపడి ఉంటాం.

– సంగన్న, గ్రామస్తుడు, తాట్‌పల్లి, సంగారెడ్డి జిల్లా

### గెజిట్ ఉత్తర్వులు వచ్చాయి



న్యాల్‌కల్ మండలంలోని తాట్‌పల్లి గ్రామాన్ని కొత్త పంచాయతీ ఏర్పాటుకు సంబంధించిన గెజిట్ ఉత్తర్వులు వచ్చాయి. మండలంలోని గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు ముందస్తు కసరత్తు జరుగుతున్నది. ఓటరు జాబితా రూపకల్పన, వార్డుల విభజన తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇస్తారు. కొత్తగా ఏర్పడిన పంచాయతీలో ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి చర్యలు తీసుకుంటాం

– సురేశ్, మండల పంచాయతీ అధికారి, న్యాల్‌కల్, సంగారెడ్డి జిల్లా

# అరకొర వైద్యసేవలు

- కోహీర్‌లోని ప్రభుత్వ దవాఖానలో ఎక్స్‌రే గదికి తాళం
- ఇబ్బందులు పడుతున్న రోగులు




సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ ప్రభుత్వ దవాఖాన





మందులు అందజేస్తున్న ఆయుర్వేదిక్ సిబ్బంది(ఇన్‌సెట్‌లో) తాళం వేసిన ఎక్స్‌రే గది

కోహీర్, ఆగస్టు 24: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. శనివారం సంగారెడ్డి జిల్లా కోహీర్ పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో రోగులకు వైద్య సేవలు కరువయ్యాయి. కొంతమంది రోగులు ఎక్స్‌రే తీయించుకునేందుకు దవాఖానకు వస్తే వారికి నిరాశే ఎదురైంది. ఎక్స్‌రే గదికి తాళం వేసి ఉండడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఓపీ చూసేందుకు ఒక ట్రైనీ డాక్టర్ మాత్రమే అందుబాటులో ఉన్నారు. మిగతా వారంతా డుమ్మా కొట్టారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రోగులకు ఉత్తమ సేవలందించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.11.50కోట్లతో దవాఖానను నిర్మించింది. కానీ సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్ల రోగులకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు. సరిపడా వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడంతో మందులు కూడా ఆయుర్వేదిక్ సిబ్బంది ఇవ్వడం విశేషం. సూపరింటెండెంట్ డాక్టర్ రజనిని వివరణ కోరేందుకు యత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

# రాష్ట్రస్థాయి యోగా పోటీలకు 82మంది ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన మెదక్ జిల్లా యోగా క్రీడాకారులు

చేగుంట, ఆగస్టు 24: రాష్ట్రస్థాయి యోగా పోటీలకు 82మంది క్రీడాకారులు ఎంపికైనట్లు మెదక్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కరణం గణేశ్‌రవికుమార్,ప్రధాన కార్యదర్శి మేడ భుజగేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం చేగుంటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో 183 మంది క్రీడాకారులు పాల్గొనగా వివిధ విభాగాల్లో 82 మంది ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగే యోగా పోటీలకు సంబంధించిన తేదీలు, జరిగే ప్రదేశాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చక్రవర్తి, జిల్లా యోగాసన స్పోర్ట్స్ కోశాధికారి సత్యనారాయణ,సెక్రటరీ నర్సింహులు, జాతీయ నంబర్‌వన్ రెఫరీ శ్రీదేవి, పీఈటీలు శ్యామ్, అల్లి నరేశ్,కర్ణం మల్లీశ్వరి, ప్రీతి, మమత, బాలరాజ్, ప్రవీణ్, నవీన్, మనోహర్‌రావు, సంతోష్ పాల్గొన్నారు.



మంత్రి పొన్నం నుంచి అవార్డు అందుకుంటున్న డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి

# సిద్దిపేట ఆర్టీసీ డిపోకు ఉత్తమ అవార్డు

సిద్దిపేట టౌన్,ఆగస్టు 24 : రాష్ట్రంలోనే సిద్దిపేట ఉత్తమ ఆర్టీసీ డిపోగా మూడో స్థానం కైవసం చేసుకున్నది.ఈ మేరకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా శనివారం హైదరాబాద్‌లో రూ.రెండు లక్షల నగదు బహుమతి, జ్ఞాపికను కార్మికుల పక్షాన డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి అందుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..2023-2024 ఆర్థిక సంవత్సరానికి ఉత్తమ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు కారణమైన కండక్టర్లు,డ్రైవర్లు, అదె బస్సు యజమానులు, సూపర్‌వైజర్లు, మెకానిక్‌లకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.ఇదే స్ఫూర్తితో పనిచేసి సంస్థను లాభాల బాటలోకి తీసుకురావాలని ఆయన కోరారు.

# ఉపాధ్యాయురాలి కోసం రాస్తారోకో



అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిట్టాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు, విద్యార్థులు

దుబ్బాక, ఆగస్టు 24: ఉపాధ్యాయురాలి కోసం గ్రామస్తులు రాస్తారోకో చేశా రు. వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిట్టాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న భాగ్యలక్ష్మి ఇటీవల మండలంలోని నగరంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపిస్తూ విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిని నిరసిస్తూ గ్రామ మాజీ సర్పంచ్ పోతనక రాజయ్య ఆధ్వర్యంలో శనివారం గ్రామస్తులు, యువజన సంఘాల నాయకులు, విద్యార్థులు రోడ్డుపై (సిద్దిపేట-రామయంపేట రోడ్డు) బైఠాయించి రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న ఎంఈవో ప్రభుదాస్ ఘటనా స్థలానికి వెళ్లి ఉపాధ్యాయురాలు డిప్యుటేషన్‌ను ఉపసంహరించినట్లు తెలిపారు.